గోల్కొండ ఆసుపత్రికి రోగుల తాకిడి



ఓపీ విభాగం వద్ద రోగుల బారులు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి పెరిగింది. డెంగీ, వైరల్ ఫీవర్, గొంతి నొప్పి, జలుబు తదితర సీజనల్ వ్యాధుల బారిన పడిన వారు గోల్కొండ ఆసుపత్రికి వస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఔట్ పేషంట్స్ సెంటర్ వద్ద రోగులు బారులు తీరుతున్నారు. అంతేకాకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే ల్యాబ్‌ల వద్ద సైతం భారీ క్యూలు ఉంటున్నాయి. అయితే ఔట్ పేషంట్ల సంఖ్యకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విభాగంలో అదనపు సిబ్బందిని నియమించడం జరిగిందని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. ఇన్ పేషంట్ విభాగం కూడా ఫుల్ ఆక్యుపెన్సీతో ఉందని ఆయన తెలిపారు.

గురువులు దైవంతో సమానం



గోల్కొండ: గురువులు దైవంలాంటి వారని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ ఆడిటోరియంలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎంపికైన ఉపాధ్యాయులకు మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగ పడే మేధావులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా, వీనస్ విద్యా సంస్థల అధినేత మహ్మద్ హిదాయత్ అలీఖాన్, శ్రీ పోతులూరు వీర బ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమితీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, బి.సాయిబాబాచారి తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిజం సమాజానికి అద్దం లాంటిది'



గోల్కొండ: జర్నలిజం సమాజానికి అద్దం లాంటిదని ఆల్ ఇండియా బజ్మ ఏ రహమత్ ఏ ఆలం అధ్యక్షుడు ఎంఏ ముజిబ్ అన్నారు. బుధవారం ఆయన అహ్మద్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు రోహిత్ ఉపాధ్యాయకు రహమత్ ఏ ఆలం పీస్ అవార్డు 2024 అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవస్థను తీర్చిదిద్ది ప్రజలకు ప్రాథమిక హకుల పరిరక్షణ, ప్రజలకు భారత రాజ్యాంగం అందించిన హక్కులను తెలియజేసేదని అన్నారు. ఆల్ ఇండియా కీరత్ కమిటీ అధ్యక్షుడు ఖారీ మౌలానా సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ మాట్లాడుతూ.. ఎన్నో దేశాల స్వాతంత్ర పోరాటంలో పాత్రికేయులు నిర్భయంగా తన పాత్రను పోషించి స్వాతంత్ర సమరయోధులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అఫ్జల్ రసూల్ తదితరులున్నారు.

రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మూల్యం తప్పదు



అఫ్జల్‌గంజ్: రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మూల్యం తప్పదని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ పేర్కొన్నారు. కొన్ని రోజులుగా తమ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై పిచ్చి పిచ్చి ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం కొనసాగుతుందన్నారు. అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉంటే బీజేపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారని గౌరి సతీష్ పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారమని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ఆయన అన్నారు.

'మంచి రచయితలుగా ఎదగడానికి సాహిత్య అధ్యయనం ముఖ్యం'



వీరలక్ష్మీదేవిని సన్మానిస్తున్న శివారెడ్డి, డాక్టర్ చెన్నయ్య తదితరులు

సుల్తాన్‌బజార్: సాహిత్యం ఆనందం కలిగించడంతో పాటు సామాజిక ప్రయోజనాన్ని సాధించేదిగా ఉండాలని ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి అన్నారు. బుధవారం బొగ్గుల కుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో పరిణత వాణి ప్రసంగ పరంపరలో ఆమె ప్రసంగించారు. తమ జీవితం అసమానతలు ఉన్న సమాజాన్ని సంస్కరించడం కూడా సాహిత్య ప్రయోజనాల్లో ఒకటన్నారు. మంచి రచయితలుగా ఎదగడానికి సాహిత్య అధ్యయనం చాలా ముఖ్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, పరిషత్ ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎ.సిల్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



చార్మినార్: వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా చార్మినార్ వద్ద రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల అనంతరం కళాకారులు మంగళవారం రాత్రి చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్యారసాని వెంకటేష్, దేవాలయం ట్రస్టీ శశికళ తదితరులున్నారు.

ఫలించిన ముందస్తు చర్యలు

- ఆనందోత్సాహాలతో ముగిసిన వినాయక ఉత్సవాలు
- ప్రభుత్వ విభాగాల సమన్వయంతో సత్ఫలితాలు
- అధికారులకు థ్యాంక్స్: గణేష్ ఉత్సవ సమితి



పాతబస్తీ నుంచి నిమజ్జనానికి వెళుతున్న ఓల్డ్ సిటీ కా రాజా వినాయక విగ్రహం

చార్మినార్: పాతబస్తీలో ప్రభుత్వ విభాగాల నడుమ సమన్వయం సత్ఫలితాలిచ్చింది. పోలీసులు, జీహెచ్‌ఎంసీ సమన్వయంతో వ్యవహరించడంతో వినాయక ఉత్సవాలకు ఎక్కడ ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా శాంతియుతంగా ముగిశాయి. వినాయక నిమజ్జనోత్సవాల ఊరేగింపులకు దక్షిణ మండలం పోలీసులు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలు ఫలించాయి. పాతబస్తీ నుంచి కొనసాగిన ప్రధాన శోభాయాత్ర ప్రశాంతంగా ముగియడంతో అటు పోలీసులు ఇటు పాతబస్తీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రజల సహాయ సహకారాలతో ప్రశాంతంగా ముగియడానికి కృషి చేసిన అధికారులను పాతబస్తీ ప్రజలు అభినందిస్తున్నారు.

త్వరగా ముగిసిన ఊరేగింపు..

ఈసారి పాతబస్తీలో కొనసాగిన సామూహిక గణేష్ నిమజ్జనోత్సవ ఊరేగింపు త్వరగా ముగిసింది. పాతబస్తీలో 2015 సెప్టెంబర్ 27న అర్ధరాత్రి 12.30 గంటల వరకు కొనసాగాయి. 2016లో బాలాపూర్ వినాయకుడు సాయంత్రం 4 గంటలకు చార్మినార్ చేరుకుని..4.30 గంటలకు నయాపూల్ దాటి వెళ్లగా..2019లో మధ్యాహ్నం 4.15 గంటలకు చార్మినార్ దాటింది. ఇక ఈసారి మధ్యాహ్నం 2.15 గంటలకు బాలాపూర్ వినాయక విగ్రహం చార్మినార్ దాటి వెళ్లడంతో దక్షిణ మండలం పోలీసులు తీసుకున్న ముందస్తు చర్యలు ఫలించాయి. ఈసారి సామూహిక వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా రాత్రి 10.30 గంటలకే పాతబస్తీలో వినాయక నిమజ్జనోత్సవం ముగిసిందని నగర పోలీసు కమిషనర్ ఎక్స్ ద్వారా ఇక్కడి అధికారులను అభినందించారు.

పాతబస్తీ ఊరేగింపునకు ప్రాధాన్యం..

సామూహిక నిమజ్జన ఊరేగింపు సందర్భంగా నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు పాతబస్తీ నుంచి వచ్చే ప్రధాన ఊరేగింపునకు ప్రాధాన్యత ఉండటంతో విగ్రహాలన్నీ ట్యాంక్‌బండ్ వైపు త్వరత్వరగా కదిలాయి. పాతబస్తీ నుంచి వెళ్లిన ప్రధాన ఊరేగింపు మోజంజాహీ మార్కెట్ ద్వారా సాగరం వైపు వెళ్లింది. అయితే మొజంజాహీ మార్కెట్ (ఎంజేఎం) వద్ద ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్, సెంట్రల్ జోన్‌ల అధికారుల నడుమ సమన్వయ లోపం కారణంగా 2015లో పాతబస్తీ ఊరేగింపు అర్ధరాత్రి వరకు.. 2016లో రాత్రి 10 గంటలకు పైగా కొనసాగింది. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాతబస్తీ వినాయక విగ్రహాలు త్వరత్వరగా నయాపూల్ దాటి వెళ్లాయి.

సహకరించిన వారందరికీ ధన్యవాదాలు..

ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, కానిస్టేబుల్స్, హోంగార్డులతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులు, టీఎస్ఎస్‌పీడీసీఎల్, జలమండలి అధికారులు.. ఇలా ప్రతి ఒక్కరూ ఎక్కడ అలసత్వం ప్రదర్శించకుండా నిరంతరం విధి నిర్వాహణ కొనసాగించడంతో జంట కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి. ఇరువర్గాల ప్రజలు తమతో పూర్తిగా సహకరించారు. అంతేకాకుండా ఈసారి పాతబస్తీలోని ప్రధాన ఊరేగింపు ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

– స్నేహా మెహ్రా, దక్షిణ మండలం డీసీపీ

సమన్వయంతో సత్ఫలితాలు...

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకున్నాం. నిమజ్జనోత్సవాలను పురస్కరించుకొని విగ్రహాల తరలింపునకు అడ్డు వచ్చే చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలను తొలగించాం. ఊరేగింపు దారి పొడవున తాత్కాలిక విద్యుత్ లైట్లను అదనంగా ఏర్పాటు చేశాం. పోలీసుల సమన్వయంతో గణేష్ యాక్షన్ టీమ్‌ను రంగంలోకి దింపి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాం. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

– వెంకన్న, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్

అధికారుల సేవలు భేష్..

గతంతో పోలిస్తే ఈసారి పాతబస్తీ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. నిమజ్జనోత్సవాల సందర్భంగా పోలీసులు ఎంతో స్నేహ పూర్వకంగా వ్యవహరించారు. ఉత్సవాల నిర్వాహకుల సలహాలు సూచనలు తీసుకున్నారు. ఉత్సవాల నిర్వాహకులు పోలీసులకు పూర్తిగా సహకరించారు. జీహెచ్‌ఎంసీ దక్షిణ మండలం అధికారులు సమన్వయంతో పని చేసినందున ఉత్సవాలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగలేదు.

– కౌడి మహేందర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి

శాతం చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే



శాతంచెరువు తూముపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: శాతంచెరువులో వర్షపు నీరు ప్రమాదస్థాయి కంటే ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన బల్దియా, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి గోల్కొండ నయాఖీలాలోని శాతం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న తూము పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ వర్షాకాలంలో భారీ వర్షాల కు శాతం చెరువు బ్యాక్ వాటర్ నదీమ్ కాలనీ లోతట్టు ప్రాంతాల వారిని భయాందోళనకు గురి చేస్తుందన్నారు. గత వర్షాకాలం నుంచి ఇప్పటి వ రకు తాను శాతం చెరువును ఎన్నోసార్లు సందర్శించానని, తూము పనులను త్వరగా పూర్తి చేయాల ని ప్రతిసారి అధికారులకు తెలుపుతున్నానన్నారు. అయితే తూము పనులను అధికారులు ప్రణాళికబద్ధంగా చేయకపోవడం వల్లనే చెరువు లోని నీరు త్వరగా బయటకు వెళ్లడం లేదని ఆయ న పేర్కొన్నారు. బల్దియా ఇరిగేషన్ అధికారి జ్యో తి, డిప్యూ టీ ఈఈ రామకృష్ణ, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

ఆదరణ లేక 'వెదురు'చూపులు



చార్మినార్ వద్ద వెదురు పనులలో నిమగ్నమైన మేదరులు

- వెదురు ఉత్పత్తులకు ప్రోత్సాహం కరువు
- ముడిసరుకుల ధరలకు అనుగుణంగా లభించని గిట్టుబాటు ధర
- ప్రతి కుటుంబానికి ఉచితంగా వెదురు కర్రలను అందజేయాలని మేదరుల డిమాండ్
- 'ప్రపంచ వెదురు డే' సందర్భంగా ప్రత్యేక కథనం

చార్మినార్: వెదురు పేద వాడికి కలపగాను..మేదరుల బతుకుదెరువుగాను..పర్యావరణ మిత్రగాను ఉప యోగపడుతుంది. వెదురు ప్రాధాన్యతను తెలియచెప్పే విధంగా ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 18న ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో మేదరులు పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించారు. వెదురుతో తయారు చేసిన వివిధ రకాల కళాకృతులను ఈ కార్యక్రమంలో పొందుపరిచి వాటి ప్రాధాన్యతను వివరిస్తూనే ప్రభుత్వాలు తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. పారిశ్రామిక వాడల్లో కాలుష్య కారక వాహనాలను, ప్లాస్టిక్‌ను ప్రోత్సాహించకుండా..అడవుల నరికివేతను అడ్డుకోవాలంటున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలంటే వెదురు ఉత్పత్తులను ప్రోత్సాహించాలంటున్నారు.

చాట నుంచి పాడే వరకు..

జన్మించిన శిశువులకు అవసరమయ్యే 'చాట'నుంచి చనిపోయిన అనంతరం శవయాత్ర కోసం వినియోగించే 'పాడే'లను సైతం వెదురు (కర్ర)లతో మేదరులు తయారు చేసి ఇస్తున్నారు. పండుగల సందర్భంగా ప్రజలందరికీ అవసరమైన వెదురుతో తయారు చేసిన రకరకాల వస్తువులను అందించే వెదురు వ్యాపారుల (మహేంద్ర–మేధరులు)కు గిట్టుబాటు ధర లభించడం లేదంటున్నారు. ఏడాది పొడవున వచ్చే బోనాలు, దసరా, దీపావళి, సంక్రాంతి తదితర పండుగలకు అవసరమైన మెటీరియల్‌ను తయారు చేసి అందిస్తుంటారు. నగరంలో రావణ ప్రతిమలతో పాటు కృత్రిమ బతుకమ్మలను తయారు చేస్తున్న మేదరులు రాత్రింబవళ్లు పని చేస్తారు. డిగ్రీలు పూర్తి చేసిన యువకులు సైతం కులవృత్తిగా ఈ పనులు చేస్తున్నారని..ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వివిధ జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని వారు కోరుతున్నారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయిలో ప్రతి ఏడాది ఒక్కో కుటుంబానికి 2000 వెదురు కర్రలను ఉచితంగా అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

చార్మినార్ ముఖ్య వ్యాపార కేంద్రం..

వెదురు తయారీ ఉత్పత్తులకు పాతబస్తీలోని చార్మినార్ ముఖ్య వ్యాపార కేంద్రంగా కొనసాగుతోంది. కొన్నేళ్లుగా ఇక్కడ కొన్ని కుటుంబాలు వెదురుతో తయారు చేసే వస్తువులను విక్రయిస్తున్నారు. పెరిగిన ముడిసరుకుల ధరలకు అనుగుణంగా గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా రావణాసురిడి ప్రతిమలతో పాటు కాగితపు పూలతో చేసే బతుకమ్మలను సైతం తాము ప్రతి ఏడాది తయారు చేస్తుంటామంటున్నారు. ఇక్కడ పని చేస్తున్న కళాకారులకు ఆశించిన మేరకు గిట్టుబాట ధర లభించడం లేదంటూ వాపోతున్నారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 18న ప్రపంచ వెదురు దినోత్సవాలను జరుపుకుంటున్నప్పటికీ వెదురు వ్యాపారులు (మేదర–మహేంద్ర కులస్తులు) ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రావణుని ప్రతిమను తయారు చేస్తున్న కార్మికుడు (ఫైల్)

రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



నిరసనలో పాల్గొన్న మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: బీజేపీ నేతలు రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. గోషామహల్ నుంచి గాంధీభవన్ వరకు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీభవన్ వద్ద నిరసన కార్యక్రమంలో మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో నినాదాలు చేశారు.

లడ్డూ అధరహో



లడ్డూతో సంతోష్‌కుమార్ కుటుంబ సభ్యులు



లడ్డూ దక్కించుకున్న లక్ష్మణ్ బ్రదర్స్



లడ్డూ దక్కించుకున్న ఆకాశ్ రాకూర్, త్రిశీవ్‌సింగ్

అబిడ్స్: రూ.లక్షకు బీఎస్‌ఐ సంతోష్‌కుమార్ లడ్డూ చేజిక్కించుకున్నారు. వైష్ణవి శివప్రతాప్ అపార్ట్‌మెంట్‌లో నెలకొల్పిన గణేష్ మండపంలో లడ్డూ వేలం ద్వారా ఆయన పొందారు.

ఇమాంపురాలో..

జియాగూడ: ఇమాంపురా నవ భారత సంఘంలో ఏర్పాటైన గణేష్ నవరాత్రి వేడుకలు పూర్తికాగా బుధవారం సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో లడ్డూ వేలం జరిగింది. 11 కేజీల లడ్డూను చాట్ల సురేష్ రూ.6,0500కు గెలుచుకున్నారు. మరో లడ్డూను రూ.7100కు వెన్నెల శ్రీనివాస్ గెలుచుకున్నారు.

జాంబాగ్‌లో..

అబిడ్స్: జాంబాగ్ సాయిక్రుపా అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన మహా గణపతి లడ్డూ వేలంలో రూ.51వేలకు లక్ష్మణ్ బ్రదర్స్ కైవసం చేసుకున్నారు. వారికి అసోసియేషన్ సభ్యులు నర్సింహారావు, పాల్, ప్రేమ్‌కుమార్, మల్లేష్, కిషోర్, వరుణ్, నరేష్, యశ్వంత్, గిరీష్, ఆకాష్ లడ్డూను అందజేశారు.

లాల్ దర్వాజాలో..

గౌలిపురా: లాల్‌దర్వాజాలో శ్రీ ఓంకార్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూను రూ.1,05,000కు దావలగిరికి చెందిన వ్యాపార వేత్త ఆకాశ్ రాకూర్, త్రిశీవ్‌సింగ్ దక్కించుకున్నారు. హనుమాన్ నగర్ ఫేస్–1లో హనుమాన్ నగర్ వెల్ఫేర్ యూత్ అసోసియేషన్‌లో ఏర్పాటుచేసిన వినాయకుడి లడ్డూను రూ.95 వేలకు హర్దీప్ సింగ్ దక్కించుకున్నారు.



లడ్డూతో హర్దీప్ సింగ్



లడ్డూ దక్కించుకున్న సురేష్, ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మధిర సత్యనారాయణ

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి



సుల్తాన్‌బజార్: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ బుధవారం గౌలిగూడ రాంమందీర్‌లో 108 కొబ్బరికాయలను కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..ప్రపంచ దేశాలలో భారతదేశానికి ఒక గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధానీ నరేంద్రమోదీ అన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేలా కృషి చేసిన పోలీస్, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, ట్రాఫిక్, వాటర్‌వర్క్స్ అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్టప్ప, రేణుకా, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నాంపల్లి విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే కమల్ సింగ్(37) ధోబీ పని చేస్తుంటారు. బుధవారం తన నివాసంలో బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేసి బట్టలు తీసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. దీంతో అతడు తీవ్ర అస్వస్థతకు లోనై మృత్యువాతపడ్డారు. ఈ ఏడాదే అతడి భార్య సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

నాంపల్లి: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బజార్‌ఘాట్ ఏ బ్యాట్రీలేన్‌లో నివాసం ఉండే ఖాజా నిజాముద్దీన్ అలియాస్ ఖాలేద్(60) ప్రైవేట్ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసి పదవీ విరమణ చేశారు. మంగళవారం రాత్రి 12 గంటలకు నాంపల్లి ఏరియా ఆసుపత్రి సమీపంలో ఉండే కురుమ బస్తీలో పరిచయం ఉండే ఓ మహిళ ఇంటికి వచ్చాడు. ఇంట్లోకి వచ్చిన కాసేపటికి అతడు అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఉదయం అక్కడికెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహార పదార్థాల అందజేత

చార్మినార్: వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా చార్మినార్ వద్ద మజ్లిస్ పార్టీ స్వాగత వేదికను ఏర్పాటు చేసి భక్తులకు ఉచితంగా ఆహార పదార్థాలను అందజేసి హిందూ–ముస్లిం భాయ్..భాయ్ అనే నినాదాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. ఎంఐఎం మాజీ కార్పొరేటర్, ప్రస్తుతం ఘాన్సీబజార్ కార్పొరేటర్ భర్త అయిన మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో చార్మినార్ మక్కా మసీదు వైపు స్వాగత వేదిక ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలకు స్వాగతం పలకడంతో పాటు భక్తులకు ఆహార పదార్థాలు అందజేసి మేమంతా ఒక్కటే అని నినదించారు.

రైతుల సంక్షేమానికి కృషి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర సహకార సంఘం అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు అన్నారు. బుధవారం సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్ ఫార్మ్ రైస్డ్ వన్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్యాక్స్ శామిర్‌పేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెజిటేబుల్ కలెక్షన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో నష్టాల్లో ఉన్న సహకార అనుబంధ సంఘాలను తిరిగి లాభాల బాటలోకి నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో టెస్కాబ్ భాగస్వామ్యంతో ఫార్మ్ రైస్ వన్ వ్యవసాయ మార్పిడి వేదికను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, నాబార్డ్ సీజీఎం చింతల సుశీల, టెస్కాబ్ సీజీఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్ప దానం

గన్‌ఫౌండ్రీ: అన్నదానం ఎంతో గొప్ప దానమని తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొత్వాల్ దయానంద్ అన్నారు. బట్కీరి కృష్ణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంజే మార్కెట్ చౌరస్తాలో బుధవారం ఉచిత అల్పాహారం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజులపాటు పెద్ద ఎత్తున గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు తాగునీరు, అల్పాహారాన్ని అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ట్రస్ట్ అధ్యక్షులు బట్కీరి శివానంద్, విద్యానంద్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.